RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 70 | మార్చి 30 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 70 | March 30 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- వలస కూలీల బైక్ ను ఢీకొన్న సైన్ బోర్డు ముగ్గురు మృతి
- రోజురోజుకు మితిమీరిపోతున్న యాక్సిడెంట్లు
- యువత యాక్సిడెంట్ ట్లకు బలి అవుతున్నారు

2

### తల్లిదండ్రులను విస్మరిస్తే

# జీతంలో కోత

### తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ బిల్లు 2026కు ఆమోదం



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఆదివారం అసెంబ్లీలో ఆమోదం పొందిన "తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ బిల్లు 2026" ద్వారా సామాజిక బాధ్యతను చట్టబద్ధం చేసింది. ఈ కొత్త చట్టం ప్రకారం, ఎవరైనా ఉద్యోగి తన తల్లిదండ్రుల కనీస అవసరాలను పట్టించుకోకుండా వారిని నిర్లక్ష్యం చేస్తే, ప్రభుత్వం వారి వేతనం నుండి నేరుగా కోత విధిస్తుంది. ఉద్యోగి జీతంలో 15 శాతం లేదా గరిష్టంగా రూ. 10,000 (ఇందులో ఏది తక్కువైతే అది) కట్ చేసి, ఆ మొత్తాన్ని నేరుగా బాధితులైన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ నిబంధన కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ పొందే సంస్థలు, ప్రైవేటు రంగ ఉద్యోగులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచ్‌ల వంటి ప్రజాప్రతినిధులకు కూడా వర్తించడం విశేషం. దీని ద్వారా సమాజంలోని అన్ని వర్గాల్లో జవాబుదారీతనాన్ని తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

➤ మిగతా 2వ పేజీలో..

# టీడీఆర్‌లో కుంభకోణం

**మాజీ మంత్రి ఆరోపణలు..**



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాజకీయాల్లో టీడీఆర్ స్కామ్ వ్యవహారం ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి యుద్ధానికి దారితీసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సంచలన ఆరోపణలు చేయడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. హైదరాబాద్‌లోని టీడీఆర్ కేటాయింపుల్లో భారీ కుంభకోణం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి హస్తం ఉందని హరీశ్ రావు నేరుగా ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిజానిజాలు బయటకు రావాలంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. "మీ సోదరుడిపై వచ్చిన ఆరోపణలు తప్పని నిరూపించుకునే ధైర్యం మీకు ఉందా?" అంటూ సీఎంకు సవాల్ విసిరారు. ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ఆయన ప్రెస్ మీట్ వేదికగా నిలదీశారు. హౌస్ కమిటీ డిమాండ్ కేవలం సీఎం సోదరుడిపైనే కాకుండా, తన తమ్ముడిపై వస్తున్న ఆరోపణల పైన కూడా హరీశ్ రావు స్పష్టతనిచ్చారు. తప్పు ఎవరు చేసినా విచారణ జరగాల్సిందేనని, సీఎం సోదరుడితో పాటు తన తమ్ముడిపై వస్తున్న ఆరోపణలపై కూడా 'హౌస్ కమిటీ' వేయాలని ఆయన ప్రతిపాదించారు. దీనివల్ల అసలు దోషులు ఎవరో ప్రజలకు తెలుస్తుందని పేర్కొన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించి అవినీతిని వెలికితీయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. టీడీఆర్ స్కామ్‌తో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన కంపెనీల వ్యవహారాలను కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. ఆ కంపెనీల అవినీతిపై హౌస్ కమిటీ వేసే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్

➤ మిగతా 2వ పేజీలో..

# రెండు రోజుల పాటు వర్షాలు



**విశాఖపట్నం జనసంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్రంలోని పలు జిల్లాలకు కీలకమైన వాతావరణ హెచ్చరికలను జారీ చేసింది. రాయలసీమ మరియు దాని పరిసర ప్రాంతాలలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావం కారణంగా రానున్న రెండు రోజుల పాటు వాతావరణంలో మార్పులు సంభవించనున్నాయని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో ముఖ్యంగా సోమవారం మరియు మంగళవారం రోజుల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం, మరియు పోలవరం పరిసర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. వాతావరణంలో ఏర్పడుతున్న ఈ అనిశ్చితి వల్ల గాలి వేగం పెరగడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ప్రమాదం

➤ మిగతా 2వ పేజీలో..

# టీమిండియా విజయంతో గర్వంగా ఉంది

### మన్‌కీ బాత్‌లో ప్రధానమత్రి మోడీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ప్రధాని నరేంద్ర మోదీ నెలవారి రేడియా కార్యక్రమం మన్‌కీ బాత్ 132వ ఎపిసోడ్‌లో భారత క్రికెట్ జట్టు విజయాలను ప్రశంసించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న జట్టుతో పాటు తొలిసారిగా రంజీ ట్రోఫీని కైవసం చేసుకున్న జమ్మూ కాశ్మీర్ జట్టును అభినందించారు. ఇటీవల భారత జట్టు న్యూజిలాండ్‌ను ఓడించి వరుసగా రెండోసారి వరల్డ్ కప్‌ని గెలిచిన విజయం తెలిసిందే. "జట్టు విజయం దేశం మొత్తానికి ఆనందాన్ని తీసుకొచ్చింది" అని ప్రధాని పేర్కొన్నారు. "ఈ నెల దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు ఉత్సాహభరితంగా గడిచింది. టీ20 వరల్డ్ కప్‌లో భారత్ చారిత్రాత్మక విజయాన్ని సాధించిన సమయంలో దేశమంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. న టీమిండియా విజయంతో అందరికీ గర్వంగా ఉంది" అన్నారు. జమ్మూ కశ్మీర్ జట్టు చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావించారు. "గత నెల చివరలో కర్నాటకలోని హుబ్లీ నగరంలో ఆసక్తికరమైన మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌ను గెలిచి జమ్మూ కాశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని కైవసం చేసుకుంది. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత తొలి టైటిల్ సాధించడం గొప్ప విషయం" అని పేర్కొన్నారు. జట్టు కెప్టెన్ పరాస్ డోగ్రా నాయకత్వాన్ని ప్రశంసించారు. అతని ప్రదర్శన జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిందన్నారు. అలాగే యువ బౌలర్ అకీబ్ నబీ రంజీ సీజన్‌లో 60 వికెట్లు తీసి దేశవ్యాప్తంగా చర్చకు కేంద్రబిందువయ్యాడంటూ ప్రధాని కొనియాడారు. ఈ విజయం జమ్మూ కాశ్మీర్ ప్రజల్లో క్రీడలపై మరింత ఆసక్తిని పెంచుతుందని, యువతకు ఇది ప్రేరణగా నిలుస్తుందని మోదీ అభిప్రాయం

➤ మిగతా 2వ పేజీలో..

# సౌదీ ఎయిర్‌బేస్‌పై దాడి



**రియాద్ జనసంఘర్షణ**
మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత కమ్ముకుంటున్నాయి. సౌదీ అరేబియాలోని ఒక అమెరికన్ ఎయిర్‌బేస్‌పై ప్రతీకార దాడులకు దిగినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ క్షిపణి, డ్రోన్ల దాడిలో అమెరికాకు చెందిన అత్యంత కీలకమైన అవాక్స్ కమాండ్ అండ్ కంట్రోల్ విమానం భారీగా దెబ్బతిన్నట్లు తెలిపింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్ లక్ష్యంగా ఇరాన్ ఈ దాడులకు పాల్పడింది. ఇక్కడ ధ్వంసమైన అవాక్స్ విమానంతో పాటు ఇతర

➤ మిగతా 2వ పేజీలో..

# భూతల దాడులకు సిద్ధమైన అమెరికా



**టెహ్రాన్ జనసంఘర్షణ**
ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతున్నది. ఒకవైపు చర్చలు అంటూనే పశ్చిమాసియాలో సైన్యాన్ని మోహరిస్తున్నది. ఇకప్పటికే వెయ్యి మందికిపైగా మెరైన్లను అక్కడికి తరలించిన పెంటగాన్.. తాజాగా 2500 మంది మెరైన్లతో అత్యాధునిక యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి పశ్చిమాసియాకు చేరుకుంది. దీంతో ఇక్కడ మోహరించిన మొత్తం అదనపు బలగాల సంఖ్య 3,500 దాటింది. ఈమేరకు యూఎస్

➤ మిగతా 2వ పేజీలో..

## తల్లిదండ్రులను విస్మరిస్తే జీతంలో కోత

**మొదటిపేజీ తరువాయి..** ఫిర్యాదుల పరిష్కారం- జిల్లా కలెక్టరే కీలక అధికారి తల్లిదండ్రులు తమ పిల్లల నుండి ఎదురయ్యే నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం సరళమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రెండు నెలల లోపు (60 రోజులు) విచారణ పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ కలెక్టర్ ఇచ్చే తీర్పుపై సంతృప్తి చెందకపోతే, రాష్ట్ర స్థాయిలోని వయోవృద్ధుల కమిషన్‌లో అప్పీల్ చేసుకునే వెసులుబాటును కూడా కల్పించారు. ఈ ప్రక్రియ అంతా తక్కువ సమయంలోనే పూర్తయ్యేలా చూడటం ద్వారా వృద్ధులకు తక్షణ న్యాయం చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం శిక్షాత్మక చర్య మాత్రమే కాకుండా, బాధితులకు భరోసా ఇచ్చే వేదికగా మారుతుంది. మారుతున్న జీవనశైలి, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం కారణంగా వృద్ధాప్యంలో ఒంటరి అవుతున్న తల్లిదండ్రులకు ఈ చట్టం ఒక రక్షణ కవచంలా నిలవనుంది. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులను గౌరవించడం ప్రాథమిక బాధ్యత అని, దానిని విస్మరించడం చట్టరీత్యా నేరమని రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చట్టం ద్వారా ఉద్యోగుల్లో భయం కంటే బాధ్యతను పెంచడం, సమాజంలో వృద్ధుల పట్ల సానుకూల దృక్పథాన్ని తీసుకురావడం ప్రధాన ఉద్దేశం. ఈ విప్లవాత్మక బిల్లు వృద్ధాప్యంలో ఉన్న వారికి ఆర్థిక స్వేచ్ఛతో పాటు ఆత్మగౌరవాన్ని ప్రసాదిస్తుందని రాజకీయ మరియు సామాజిక విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.

# టీడీఆర్‌లో కుంభకోణం

**మొదటిపేజీ తరువాయి..** ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కాంట్రాక్టుల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షాలపై బురదజల్లుతున్నారని విమర్శించారు. ఈ టీడీఆర్ కుంభకోణంపై తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# టీమిండియా విజయంతో గర్వంగా ఉంది

**మొదటిపేజీ తరువాయి..** వ్యక్తం చేశారు. గుల్మార్గ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌తో జమ్మూ కశ్మీర్ క్రీడల్లో ఎదుగుతోందని పేర్కొన్నారు. యువ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ అంతర్జాతీయ స్థాయిలో 'స్క్వాష్ ఆన్ ఫైర్' పోటీలో విజయం సాధించి, కేవలం 17 ఏళ్ల వయసులోనే పీఎస్ఏ ర్యాంకింగ్స్‌లో టాప్-20లో చోటు సంపాదించినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అథ్లెట్ గుల్వీర్ సింగ్ న్యూయార్క్ సిటీ హాఫ్ మారథాన్‌లో మూడో స్థానం సాధించి, గంటలోపు హాఫ్ మారథాన్ పూర్తి చేసిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడని తెలిపారు. 'అస్మిత అథ్లెటిక్స్ లీగ్' గురించి సైతం ప్రస్తావించారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో దాదాపు రెండు లక్షల మంది యువతులు పాల్గొన్నారని తెలిపారు. దేశంలో క్రీడల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు.

## రెండు రోజుల పాటు వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తీరప్రాంత మరియు ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా ఆకస్మికంగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండటం ప్రమాదకరమని తెలిపారు. పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉన్నందున పొలాలు, చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల సమీపంలో తలదాచుకోవద్దని సూచించారు. రైతులు, గొర్రెల కాపరులు మరియు కూలీలు వర్షం కురిసే సమయంలో సురక్షితమైన భవనాల్లోకి వెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షం మరియు గాలివానల వల్ల కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని, వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని సంస్థ తెలిపింది. జిల్లా యంత్రాంగాలు ఇప్పటికే అప్రమత్తమై క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు అందించాయి. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక అధికారుల సమాచారాన్ని అనుసరించాలని, వాతావరణం అనుకూలించే వరకు అప్రమత్తత వీడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. గతంలో కురిసిన వర్షాల వల్ల కలిగిన పిడుగుల నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

## హైదరాబాద్‌లో మర్యాదపూర్వక భేటీ

- **మాజీ కలెక్టర్ డా. ఎన్. సత్యనారాయణకు**

**డిసిసి అధ్యక్షులు ఘన సత్కారం...**

**హైదరాబాద్/ మార్చ్29/(జన సంఘర్షణ)**



హైదరాబాద్‌లోని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టి జి ఆర్ ఈ ఆర్ఏ) చైర్‌పర్సన్ డా. ఎన్. సత్యనారాయణ గారి నివాసంలో మర్యాదపూర్వక భేటీ జరిగింది. కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గారు వారిని కలుసుకుని పుష్పగుచ్ఛం (బొకే) మరియు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డా. ఎన్. సత్యనారాయణ సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. ముఖ్యంగా 2016 నుంచి 2020 వరకు కామారెడ్డి జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆయన నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పరిపాలన, ప్రజల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలు జిల్లా ప్రజల మన్ననలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన పరిపాలనలో జిల్లా అభివృద్ధి దిశగా అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అలాగే, జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గారి నాయకత్వాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న కృషిని అభినందించారు.

## కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **వలస కూలీల బైక్ ను ఢీకొన్న సైన్ బోర్డు ముగ్గురు మృతి**
- **రోజురోజుకు మితిమీరిపోతున్న యాక్సిడెంట్లు**
- **యువత యాక్సిడెంట్ ట్లకు బలి అవుతున్నారు**

**కామారెడ్డి /మార్చ్ 29/(జన సంఘర్షణ)**



శనివారం రాత్రి కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రాంపూర్ గడ్డ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు లాలీటూమ్ కుమార్ (27), నరేష్ కుమార్ (30), రాహుల్ (20) బైక్ పై అతివేగంతో వెళ్తుండగా, రోడ్డు పక్కన ఉన్న సైన్ బోర్డును బలంగా ఢీకొట్టారు. ఈ దుర్ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు.

**మొదటిపేజీ తరువాయి..** అమెరికా సైనిక ఆస్తులు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. విమానం ఛిద్రం: ఇరాన్‌కు చెందిన ప్రెస్ టీవీ విడుదల చేసిన తాజా చిత్రాల్లో, అవాక్స్ విమానం మధ్యభాగం పూర్తిగా ఛిద్రమైపోగా.. కేవలం తల, తోక భాగాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు కనిపిస్తోంది. భారీ ఆయుధాల వినియోగం: ఈ దాడిలో 6 బాలిస్టిక్ క్షిపణులు, 29 డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. సైనికులకు గాయాలు: ఈ దాడిలో కనీసం 10 మంది యూఎస్ సిబ్బంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. మరింత నష్టం: దాడిలో పలు రీఫ్యూయలింగ్ విమానాలు కూడా దెబ్బతిన్నాయని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, యూఎస్ సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) ఈ ఘటనపై ఇంకా అధికారికంగా స్పందించలేదు. దీంతో పాటు ఒక యూఎస్ మీు-9 డ్రోన్‌ను కూల్చివేశామని, ఒక ఖీ-16 జెట్‌ను కూడా దెబ్బతీశామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లాంగ్-రేంజ్, మీడియం-రేంజ్ క్షిపణుల ద్వారా అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ దాడులకు పాల్పడినట్లు ప్రెస్ టీవీ తెలిపింది.

రెండో నెలలోకి ప్రవేశించిన యుద్ధం

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఎలాంటి కవ్వింపు లేకుండా యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి ఈ ఎయిర్‌బేస్‌పై పదేపదే దాడులు జరుగుతున్నాయి. ఈ యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, భద్రతా విభాగాధిపతి అలీ లారీజానీ వంటి అగ్రశ్రేణి నాయకులను అమెరికా-ఇజ్రాయెల్ కూటమి హతమార్చింది. అయితే, ఈ కూటమి ప్రయోగించిన క్షిపణులు మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై పడటంతో సుమారు 180 మంది విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో రగిలిపోతున్న ఇరాన్.. గల్ఫ్ దేశాల్లోని యూఎస్ ఎయిర్‌బేస్‌లపై ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది.

సౌదీ దాటి విస్తరిస్తున్న ఉద్రిక్తతలు

ఈ యుద్ధం ఇప్పుడు సౌదీ అరేబియా సరిహద్దులను దాటింది. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు శనివారం ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. ఇరాన్‌లోని విద్యాసంస్థలపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా.. ఇజ్రాయెల్, అమెరికా విశ్వవిద్యాలయాలపై ప్రతీకార దాడులు చేస్తామని టెహ్రాన్ హెచ్చరించింది.

మరోవైపు, పౌర మౌలిక సదుపాయాలపై దాడులు కూడా కొనసాగుతున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం భారీ పేలుళ్లు సంభవించాయి. షాఫ్ట్ నగరం సమీపంలోని నివాస ప్రాంతంలో జరిగిన ఈ పేలుళ్లలో ఇద్దరు మరణించగా, ఐదుగురు గాయపడినట్లు మెహర్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. శనివారం జరిగిన దాడుల్లో బుషెహర్ ప్రావిన్స్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించగా, ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని ఓ వాటర్ ఫెసిలిటీ ధ్వంసమైంది.

దీనికి దీటుగా ఇరాన్ సైన్యం కూడా ప్రతిదాడులకు దిగింది. హైఫాలోని మిలిటరీ ఏరోస్పేస్ కాంప్లెక్స్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ కంపెనీ 'ఎల్టా' (జుశ్రీఖ) నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, రాడార్ సెంటర్‌తో పాటు బెన్ గురియన్ విమానాశ్రయంలోని ఇంధన నిల్వ కేంద్రంపై తాము దాడులు చేసినట్లు ఇరాన్ ఆర్మీ ప్రకటించింది.

## మిర్జాపూర్ నుంచి కొండగట్టు కు పాదయాత్ర



**నస్రుల్లాబాద్ /మార్చ్ 29(జన సంఘర్షణ)**

కామారెడ్డి జిల్లా నర్సుల్లాబాద్ మండలం మిర్జాపూర్ హనుమాన్ స్వాములు శనివారం కొండగట్టుకు పాదయాత్ర చేస్తూ బయలుదేరినారు . కొండగట్టుకు అంజన్న స్వామిని నమ్ముకొని పాదయాత్రగా బయలుదేరినారు పోతునురి అశోక్ కుమార్ గురు స్వామి . ప్రసాద్ స్వామి . విష్ణు స్వామి . గంగాధర్ స్వామి బి. సాయి తేజ స్వామి బి. భాస్కర్ స్వామి పి. రాము స్వామి . శ్రీనివాస్ స్వామి వా. అరవింద్ స్వామి డి. కాంతు స్వామి టి. సాయ గౌడ్ స్వామి . చిన్న స్వామి . శివ కుమార్ స్వామి . మొగులయ్య స్వామి నరేష్ స్వామి హరికాంత్ స్వామి శ్యాంసుందర్ స్వామి. తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**అడ్డూరు/మార్చ్ 29/(జన సంఘర్షణ)**

కేరళ అసెంబ్లీ ఎలక్షన్స్ ప్రచారంలో భాగంగా..రేపు అడూర్ నియోజకవర్గానికి ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారు విచ్చేస్తున్నారు..

ఈ సందర్భంగా ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో రాహుల్ గాంధీ గారు పాల్గొననున్నారు.. ఏఐసీసీ కార్యదర్శులు బీఎం సంతోష్ , సజారితా, ఎంపీ ఆంటోనీ, రాష్ట్ర ముఖ్య నాయకులు మరియు ఉన్నతాధికారులతో కలిసి అడూర్ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకులు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గారు సభా స్థలాన్ని మరియు ఏర్పాట్లను పరిశీలించారు..

సభకు విచ్చేసే కార్యకర్తలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, భారీ సంఖ్యలో జన సమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు..

## చలో ఇంద్ర పార్క్ నిరాహారదీక్ష కు సోమవారం 30నా..

**మార్చ్29 (జన సంఘర్షణ)**

హైదరాబాద్ ఇంద్ర పార్క్ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు భూమయ్యలిమాదిగ పిలుపు లి

సంక్షేమ పథకాల సాధనకై మాదిగ దండోరా హైదరాబాద్ ఇంద్ర పార్క్ తరలిరావాలని. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చినటువంటి సంక్షేమ పథకాలు త్వరగా నెరవేర్చాలని మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి వానిని నెరవేర్చాలని. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. అభయ .హస్తం 12 లక్షల ఆర్థిక సాయం తక్షణమే అందించాలి అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి కేటాయించాలి + ప్రకారం పట్టాలు ఇచ్చి అమ్ముకునే హక్కు కల్పించాలి

విద్య రిజర్వేషన్ కార్పొరేట్ విద్య సంస్థలో 25% ఉచిత విద్యను కచ్చితంగా అమలు చేయాలి. ఎస్సీ కార్పొరేషన్ నిధులు కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్ల రూపాయలు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. కార్మికుల గుర్తింపు కార్డు కార్మికులకు 4వ తరగతి ఉద్యోగుల గుర్తించి 20వేల కనీస వేతనం ఇవ్వాలి.

లీడ్ క్యాప్ పునరుద్ధాన. తోలు పరిశ్రమ కు 10.000 కోట్ల రూపాయలు కేటాయించాలి చైర్మన్ ని నియమించి తోలు పరిశ్రమకు ఏర్పాటు చేసి మాదిగ యువతకు ఉపాధి కల్పించాలి.

ఇంద్రమ్మ ఇల్లు ఇస్తున్న ఆర్థిక సాయం 5 లక్షలు తోపాటు ఇసుక సిమెంట్ స్టీల్ విధిగా ఇవ్వాలి నిరుపేదలకు 10 లక్షలు కేటాయించాలి ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బంగారు రవి జుక్కల్ నియోజకవర్గం ఇంచార్జ్ వెండి యాదవరావు సీనియర్ నాయకులు రేణి రాములు పాల్గొన్నారు

## కుంభకోణాల పై సిట్టింగ్ జడ్జీ విచారణ జరిపించాలి

**హైదరాబాద్** కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతి కుంభకోణాల పై సిట్టింగ్ జడ్జీ విచారణ లేదా హౌస్ కమిటీ వేసి విచారణ జరిపించాలని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రం అవినీతి కుంభకోణాల కేంద్రంగా మారిపోయిందని.. లెక్కకు మించిన కుంభకోణాలు బయటపడుతుండటమే ఇందుకు సాక్ష్యమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయంతో అక్రమాలు జరుగుతున్నాయనే

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ )

ఇల్లందు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పార్టీ కార్యకర్తలు, ప్రజలకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ నాయకులను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, టీఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు దాసరి గోపాలకృష్ణ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేద ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల ఫలితమే ఈ పార్టీ అని పేర్కొన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, తక్కువ ధరలకు విద్యుత్ సరఫరా, "కూడు-గుడ్డ" వంటి సంక్షేమ నినాదాలతో పాటు పటేల్-పట్వారి వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం వంటి కీలక సంస్కరణలను



తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిందని వివరించారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చి ముందుకు నడిపించిందని, పార్లమెంట్‌లో దళితుడిని స్పీకర్‌గా చేసిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీదేనని గుర్తు చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో కూడా తెలుగుదేశం పార్టీ పాత్ర కీలకమని, ఎన్టీఆర్, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని, ప్రజలు అపూర్వమైన మెజార్టీతో ఆశీర్వదించారని అన్నారు. రానున్న కాలంలో తెలంగాణలో కూడా



తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మనుబోతుల అఖిల్, సీనియర్ నాయకులు శ్యామ్ తీవారి, కారు నరసన్న, మైపా బాలరాజు, చెలిమల బాబు, నున్నా రామకృష్ణ, కందిరవి, దగ్గుల లింగయ్య, గోగేలా రాజేష్, ముక్కు శ్రీవెద్, దేవరకొండ నవీన్, కామ ప్రణయ్, రాజ్‌కుమార్, సన్నీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ బందిఖానాలో బాల్యం

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లందు ప్రతినిధి జన సంఘర్షణ

చిన్న చిన్న కళ్లు పెద్దవి చేసి సెల్‌ఫోన్‌లో మునిగిపోయిన పిల్లలు... ఇదే నేటి సమాజం ముందుంచుతున్న బాధాకర దృశ్యం. ఒకప్పుడు ఆవరణల్లో మార్మోగిన ఆటల శబ్దాలు, పల్లె గాలిలో పరుగులు తీసిన బాల్యం... ఇవన్నీ ఇప్పుడు స్క్రీన్‌ల వెనుక బందీ అయ్యాయి. విద్య కోసం, వినోదం కోసం, స్నేహాల కోసం అన్నింటికీ సెల్‌ఫోన్ ఒక్కటే మార్గంగా మారింది. కానీ ఈ సౌకర్యం వెనుక దాగి ఉన్న నష్టం ఎంతో పెద్దది. కదిలే కాళ్లు నిలిచిపోయాయి... ఆలోచించే మెదడు మెల్లగా అలసిపోతోంది... ప్రకృతితో బంధం తెగిపోతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం ఎవరంటే తల్లిదండ్రులే అని చెప్పక తప్పదు. తమ ఆశలు,



అంచనాలతో పిల్లలను మార్కుల పోటీలో నెట్టేస్తూ...వాళ్ల బాల్యాన్ని క్రమంగా దూరం చేస్తున్నారు. తాతమ్మల కథల స్థానంలో ఇప్పుడు వీడియోలు, ఆటల స్థానంలో మొబైల్ గేమ్స్ వచ్చాయి. తల్లిదండ్రులారా... ఇకనైనా ఆలోచించండి! పిల్లలకు మీరు ఇచ్చే సమయం, ప్రేమ, మార్గదర్శకతే వారి నిజమైన సంపద.వారితో మాట్లాడండి..కథలు చెప్పండి..విలువలు నేర్పండి..సెల్‌ఫోన్ కంటే మీ సాన్నిధ్యం గొప్పదని వారికి తెలియజేయండి. రోజుకు కొంత సమయం పిల్లలతో గడపండి. బయట ఆటలు ఆడేలా ప్రోత్సహించండి. సెల్‌ఫోన్ వినియోగానికి పరిమితులు పెట్టండి. మంచి-చెడులను వివరించండి. కుటుంబ బంధాలను బలపరచండి పిల్లల బాల్యం ఒక అమూల్యమైన దశ. అది తిరిగి రాదు. సెల్‌ఫోన్ మాయలో ఆ బాల్యాన్ని కోల్పోనివ్వకండి.

# నిజామాబాదు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహణ

- **యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుంది : పోలీస్ కమీషనర్ వెల్లడి**
- **మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి**
- **మత్తుపదార్థాలకు వద్దు చెప్పండి, జీవితానికి అవును చెప్పండి.**
- **అనే నినాదంతో యువత ముందుకు వెళ్ళాలి.**

నిజామాబాద్ మార్చి 29 జన సంఘర్షణ

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ రూరల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉదయం 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ చౌరస్తా వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. హాజరై జండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా యువత సన్మార్గంలో నడవాలి చెడు అలవాట్లకు దూరముగా ఉండాలి , డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అనే సందేశం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... యువతే దేశానికి భవిష్యత్తు. మీలో ఉన్న శక్తి, సామర్థ్యాన్ని సరైన దారిలో వినియోగిస్తే మీరు మాత్రమే కాదు, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం క్రీడలు, వ్యాయామం చాలా అవసరం. అలాంటి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలి. ఇటీవల కాలంలో యువతలో చెడు అలవాట్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండటం అత్యంత అవసరం. ఒకసారి ఆ అలవాట్లలో పడితే బయటపడటం చాలా కష్టం. కాబట్టి మీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంచి మార్గాన్ని ఎంచుకోండి. మరియు మన దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉంది కావున యువకులు, విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై డ్రగ్స్ బారిన పడకూడదని సూచించడం జరిగింది. ఈ సమాజంలో ఎవరైనా డ్రగ్స్ గాని, గంజాయి గాని అమ్మిన, సేవించిన చట్ట ప్రకారం చర్యలు







తీసుకోబడతాయి. ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే 1908 నెంబర్ లేదా 100 కు కాల్ చేయాలని సూచించడం జరిగింది. డ్రగ్ ఫ్రీ సొసైటీగా తీసుకురావాలని, దీనికి ప్రజల సహకారం యువత సహకారం మీడియా సహకారం ఉండాలని కోరడం జరిగింది. తల్లిదండ్రులకు, గురువులు చెప్పే మంచి మాటలు వినండి. సమాజానికి ఉపయోగపడే పనులు చేయండి. మీరు సన్మార్గంలో నడిస్తే మీ కుటుంబానికి, సమాజానికి గర్వకారణం అవుతారు. ఈ 2కె రన్ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంచడం మాత్రమే కాకుండా, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఒక బలమైన సందేశాన్ని నిజామాబాద్ పోలీస్ శాఖ అందిస్తున్నదని, అందరూ ఈ సందేశాన్ని జీవితంలో ఆచరించాలి." ఇలాంటి సందేశం ద్వారా యువతలో సానుకూల మార్పు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు డాన్సులు, నాటకాల రూపంలో గంజాయి పర్యావసనాలని ప్రజలకు చూపించడం జరిగింది. తర్వాత 2కే రన్ ని పోలీస్ కమీషనర్ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ 2 కె రన్ బై పాస్ చౌరస్తా నుండి ఐడిఓసి కార్యాలయం వరకు నిర్వహించడం జరిగింది. ఈ 2కె రన్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమీషనర్ చేతులమీదుగా వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, నిజామాబాదు ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, నిజామాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎస్సైలు ఎండి షరీఫ్ , ఆనంద్ సాగర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, గిరిరాజు కాలేజీ, సీఎస్ఐ కాలేజీ, వివేకానంద హై స్కూల్, ప్రభుత్వ డైట్ కాలేజీ, ఎస్సీ హాస్టల్, డిఎస్ టెక్నాలజీ మొదలగు కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ నవ భారత సాక్షారత కార్య క్రమం

మార్చ్ 29 (జనసంఘర్షణ)



ఉల్లాస్ నవ భారత సాక్షారత కార్య క్రమంలో భాగంగా మూల్యాంకన పరీక్ష బిర్కూర్ మండలంలోని పీఎం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకన పరీక్ష నిర్వ హించడం జరిగింది. ఇట్టి కార్యక్రమ యొక్క ముఖ్య ఉద్దేశం చదవడం, రాయడంలో వయోజన మహిళలకు ప్రాథమిక అంశాలుపై మూల్యాంకన పరీక్ష నిర్వహించడం జరిగింది. 8 పేజీలతో కూడిన 20 ప్రశ్నల సరళినీ వయోజనులకు 150 మార్కులకు ఇవ్వనైనది. ఇట్టి కార్య క్రమంలో బిర్కూర్ సర్పంచ్ అరిగే ధర్మ తేజ, బిర్కూర్ మండల విద్యాధికారి వెంకన్న, బిర్కూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డ్ మెంబర్ నవీన్ లు సందర్శించడం జరిగింది. పరీక్ష నిర్వాహకులు ఐకేపీ సిబ్బంది సీసీ భూమయ్య, వీఓఏ నాగమణి, హైమవతి, శృతి, జీవిత, మేహరున్నిషలు నిర్వహించడం జరిగింది.

# బీజేపి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు నియామకం..

రాజంపేట :మార్చ్ 29 (జనసంఘర్షణ)



కామారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేట మండలంలోని ఆరు గ్రామాలలో బీజేపి నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షులు సంపత్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట మండలంలోని 6 గ్రామాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రాజంపేట గ్రామ అధ్యక్షులుగా గుర్రాల రాము, కార్యదర్శిగా వంశీ, తలమడ్ల గ్రామ అధ్యక్షులుగా గంగిరెడ్డి ప్రభాకర్, కార్యదర్శిగా సావుసాని శాంతన్ రెడ్డి, పొందుర్తి గ్రామ అధ్యక్షులుగా ర్యానబోయిన నర్సింలు, కార్యదర్శిగా కుంట శ్రీనివాస్ రెడ్డి, శివాయిపల్లి గ్రామ అధ్యక్షులుగా గిరిధర్ రావ్, కార్యదర్శిగా స్వామి, అరేపల్లి గ్రామ అధ్యక్షులుగా చాకలి సంతోష్ కుమార్, కార్యదర్శిగా సబావత్ అనిల్, పెద్దాయిపల్లి గ్రామ అధ్యక్షులుగా బోయిని నాగరాజు, కార్యదర్శిగా మైలారం అనిల్ లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. వివిధ గ్రామాల నూతన అధ్యక్ష, కార్యదర్శులకి అభినందనలు తెలుపుతూ, పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి కష్ట పడి పని చెయ్యాలి అని, కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చెందేటట్లు చూడాలన్నారు.

# టేక్రియల్‌లో శివాజీ విగ్రహం భూమి పూజ..



కామారెడ్డి,మార్చ్ 29 : ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు టేక్రియాల్‌లో ఆదివారం శివాజీ విగ్రహంకు భూమి పూజ చేశారు. అనంతరం పాత అంబేద్కర్ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహం పునర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, స్థానిక కౌన్సిలర్ కొత్తపల్లి లలిత చిట్టి బాబు, మాజీ కౌన్సిలర్ శంకర్ రావు, బలవంత్ రావు, రాజు, రవి పాటిల్ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పెగడపల్లిలో శ్రీ మరిగమ్మ దేవాలయ రెండవ వార్షికోత్సవం



బోధన్ మార్చి 29జన సంఘర్షణ

బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఆదివారం రోజున మరిగమ్మ దేవాలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరిగమ్మ దేవాలయం నిర్వాహకులు కమిటీ సభ్యులు రామయ్య, అబ్బయ్య, భాను ప్రకాష్ , మోహన్ గంగాధర్ సాయిలు పోశెట్టి సాయిలు గ్రామ పెద్దలు రాజారెడ్డి, లక్ష్మారెడ్డి, సుదర్శన్, పోతరెడ్డి కృష్ణారెడ్డి, మేడి రవి, సుదర్శన్ రెడ్డి, కారడిసాయిలు, లింగారెడ్డి సాయిలు, హైమద్, నాగభూషణ్ రెడ్డి, గణేష్ గౌడ్, పి. రాజి తదితరులు పాల్గొన్నారు. బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో ఏప్రిల్ 03 నా శుక్రవారం ఎల్లమ్మ జాతర సందర్భంగా కుస్తీ పోటీలు సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించబడతాయి.

జన సంఘర్షణ

సోమవారం 30 మార్చి 2026

# జాతీయ లోక అదాలత్‌లో 5662 కేసులో పరిష్కారం

- సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన 31,82,649-00 రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు అందజేత
- జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులను , సిబ్బందిని అభినందించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐపిఎస్.
- పోలీస్ కమీషనర్ వెల్లడి.

నిజామాబాద్: మార్చి 29 జన సంఘర్షణ

గత నెల రోజుల నుండి శని వారం రోజున 28 వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా , జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఐపిసి, బిఎన్ఎస్ , ఎస్-ఎల్ఎల్ 621 కేసులు, సైబర్ క్రైమ్ 134 కేసులు, ఇ-పెట్టి 2190 కేసులు, డిడి ఎమ్‌వి యాక్ట్ 2717 మొత్తం 5662 కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ...జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా నిజామాబాదు జిల్లాకు సైబర్ క్రైమ్, వివిధ కేసులలో రాజీ మార్గం జరిగిందన్నారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా ఉంచడంలో కృషి చేసిన అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, కోర్టు సిబ్బందిని జిల్లా పోలీస్ కమీషనర్ అభినందించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని , అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని , డీఎస్పీ ,ఎస్ బి, తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ ఐ.పి.ఎస్., ఆద్వర్యంలో 7 కమీషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లు, ప్రతి జిల్లాలో డీ4సిని ఏర్పాటు చేసి డియస్పి స్థాయి అధికారులచే పర్యాయవేక్షించడం జరుగుతుందన్నారు. నిజామాబాదు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన సైబర్ నేరాలలో ఈ జాతీయ మెగా లోక్-అదాలత్ నందు 134 సైబర్ క్రైమ్ కేసులలో 31,82,649-00 రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపించడం



జరిగిందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి గాని, హెచ్‌టీటీపీ://సైబర్‌క్రైమ్.జోవోవీ.ఇన్ పోర్టల్ నందు లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జాతీయ మెగా లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు సైబర్ క్రైమ్ ఏసీపి వై. వెంకటేశ్వర్ రావ్ , సీఐ ముఖిద్ పాషా, సిసిఆర్బి సీఐ అంజయ్య, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ అభినందించారు.

# ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులకు వినతి పత్రం

- అందజేసిన జి. రమేష్ నాయుడు.

హైదరాబాద్ ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):



హైదరాబాద్ ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ పరిధిలోని కొన్ని విద్యా సంస్థలు, సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అధికారిక ప్రకటనలు లేకుండానే ఎస్ఎస్సి బోర్డు అడ్మిషన్లను ముందుగానే నిర్వహిస్తున్నట్లు మా ఏఐఎస్ఓ టీజీ దృష్టికి వచ్చింది.
ఇంకా, సరైన అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని విద్యాసంస్థలు కూడా ఈ ముందస్తు అడ్మిషన్లలో పాల్గొంటున్నాయని సమాచారం అందింది. గతంలో ఇటువంటి అనధికార చర్యలు విద్యార్థులలో గందరగోళాన్ని సృష్టించి, విద్యా షెడ్యూల్‌ను దెబ్బతీసి, వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయాన్ని అత్యంత గంభీరంగా పరిగణించి, ఇటువంటి అక్రమాలను తక్షణమే అరికట్టాలని, అడ్మిషన్లు కేవలం అధికారిక మార్గదర్శకాల ప్రకారమే నిర్వహించబడేలా చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి దృష్టికి ఏఐఎస్ఓ టీజీ తీసుకురావడం జరిగింది. విద్యార్థుల ప్రయోజనం, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం దృష్ట్యా ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులకు వినతి పత్రం, జి.రమేష్ నాయుడు అందచేశారు.

# మద్యం మత్తులో వాహనం నడపొద్దు: కామారెడ్డి ఎస్పీ

కామారెడ్డి,మార్చ్ 29 : ( జన సంఘర్షణ )




కామారెడ్డి జిల్లాలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 553 మంది పట్టుబడ్డారు. వీరికి కోర్టు రూ. 6,38,500 జరిమానా విధిస్తూ, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష ఖరారు చేసింది. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంత కమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా మెలగాలని ఆయన కోరారు.

# భళా..!! తెలుగు యూనివర్సిటీ విద్యార్థుల నృత్య కళ ప్రదర్శన

- ప్రేమాక్షరి పుస్తకావిష్కరణలో అద్భుత ప్రదర్శన.
- బోనాల ప్రదర్శనకు ప్రముఖుల ప్రశంసలు.
- నా జీవితంలో శ్రద్ధగా చూసిన ప్రదర్శన : వీసీ నిత్యానందరావు.
- కళ కూడా కమ్యూనికేషనే : సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్.
- దుమ్ములేపిన లంబాడీ డ్యాన్స్.

హైదరాబాద్ :మార్చి 29 జన సంఘర్షణ



పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, దప్పుల మోతలు, గజ్జెల గలగలలు కలిసి బోనాల సంబురం అంబరాన్ని తాకింది. తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియం దద్దరిల్లింది. సాంబ్రాణీ పొగ, కల్లు సాకలతో బోనాల ఊరి జాతరను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలోని లలిత కళా పీఠం ఫోక్ ఆర్ట్స్ విద్యార్థులు ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం రోజు జరిగిన ప్రేమాక్షరి పుస్తకావిష్కరణ వేదిక మీదకు తీసుకొచ్చి భళా అనిపించేలా ప్రదర్శించారు. లక్ష్మమ్మ, పోచమ్మకు బోనం చేయంగా అంటూ.. విద్యార్థి దశలోనే ఆ కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆడిటోరియంలో పూనకాలు తెప్పించింది. శివసత్తులు శివాలెత్తించారు. రావే రావే పెద్దమ్మా.. నిన్ను రాజులు కొలిచిన జేజమ్మ.. మహిమలు గల రుద్రమ్మ.. మమ్ము చల్లగా చూడే ఎల్లమ్మ అంటూ వేదిక దద్దరిల్లేలా ఆడిపాడారు. కత్తులు బల్లెము చేతబట్టి దుష్టుల తలలు మాలగట్టి.. అంటూ హోరెత్తించే దప్పుల మోతకు ఆడిటోరియం ప్రాంగణాన్ని మారుమోగించారు. పూనకాలతో ఊగే అమ్మవారిని కళ్లకు సాక్షాత్కరించారు. పీఠాధిపతి డా.విజయ్‌పాల్ తీర్చిదిద్దిన విద్యార్థినీ విద్యార్థుల ప్రదర్శన అలరించిందని ప్రముఖులెందరో ప్రశంసించారు.

**ఎంతో శ్రద్ధగా చూశా : వీసీ వెలుదండ నిత్యానందరావు**

తాను పుస్తకాలు, సాహిత్యంలో పుట్టి పెరిగానని, తన జీవితంలో అత్యంత శ్రద్ధగా చూసిన ప్రదర్శన ఇది అని జానపద విభాగం విద్యార్థుల బోనాల నృత్యాన్ని తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు కొనియాడారు. నృత్యం, గానం అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులను అభినందించారు. కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడే ఆయా ప్రదర్శనలు గొప్పవని చాటి చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ముందు తరం వాళ్లు గొప్పవాళ్లు అనుకుంటారని, తర్వాతి తరంలో శ్రద్ధాశక్తులు లేవని అంటారని, కానీ ఏ కాలానికి ఆ కాలం అనువైన వాతావరణం ఏర్పాటు చేస్తుందని నిత్యానందరావు అన్నారు. అందుకు నేటి ఈ విద్యార్థుల ప్రదర్శనే నిదర్శనం అని చెప్పారు. విద్యార్థులకు పీఠాధిపతులు చక్కని శిక్షణ ఇస్తున్నారని అభినందనలు తెలిపారు.



**కళ కూడా కమ్యూనికేషనే : సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్**

సమాజంలో కళ కూడా ప్రజలకు మంచి, చెడులు, సంస్కృతీ సంప్రదాయాలు తెలిపే కమ్యూనికేషన్ సాధనమే అని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ తెలిపారు. తెలుగు వర్సిటీ జానపద విభాగం విద్యార్థుల ప్రదర్శన ఆద్యంతం అలరించిందని అభినందించారు. కొండూరి కోటిబాబు, దాసు, నాగుల అంజిబాబు (యన్. ఆంజనేయులు) తదితరుల పర్యవేక్షణలో ప్రేమాక్షరులు రచించిన ప్రేమాక్షరి పుస్తకావిష్కరణలో చివరిగా విద్యార్థులు ప్రదర్శించిన లంబాడీ డ్యాన్స్ కూడా దుమ్ము లేపింది. ఈ ప్రదర్శనను వీక్షించిన రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, సామాజిక తదితర శాస్త్రాల పీఠం డీన్ ఆచార్య బీ.హెచ్. పద్మప్రియ, ఇతర విభాగాధిపతులు, జర్నలిజం అధ్యాపకులు డా. షేక్ హసీనా, డా. షేక్ షమీర్, డా. వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు ప్రశంసించారు.

# మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బండి సిద్ధులుకి శుభాకాంక్షలు

- శాలువాతో సత్కరించిన విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):




శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ 33 బ్లాక్ శ్రీ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా బండి సిద్ధులుని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, జితేందర్, కిషన్ రావు, శంకర్, శ్రీనివాస సాగర్ రవి చారి, ప్రసాద్, మల్లికార్జున్, నారాయణ, నాగార్జున, విజయ్ టిల్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాజీ బ్రైన్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


హైదరాబాద్,కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు మార్చి 29 (జన సంఘర్షణ):



కూకట్‌పల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ, సెకండ్ ఫేస్‌లో ఉన్న బ్యాజీ బ్రైన్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్టులుగా చెఫ్ ప్రభాకర్ రావు, శ్రీనివాస్ రావు, విజయ లక్ష్మి, శ్రీధర్, కళ్యాణ్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జయ లక్ష్మి స్టాఫ్ సభ్యులు హాజరైనారు. విద్యార్థులు ప్రదర్శించిన కుచిపుడి, భరతనాట్యం ఇతర నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. తల్లిదండ్రులు, పిల్లలు ఉత్సాహంగా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్నారు. రాజేష్ బదోని, స్మితా బదోని పిల్లలు అనిరుధ్ బదోని, రుద్ర బదోని ఈ వేడుకలో అవార్డులు షీల్డ్స్ అందుకున్నారు. బ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఈ పాఠశాల యజమానులు తెలంగాణ సంస్కృతిని, అన్ని మతాల విద్యార్థులకు నేర్పుతూ, విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.

# వివేకానంద నగర్‌లో ఘనంగా జై రామన్ 3డి స్టూడియో ప్రారంభోత్సవం

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):



కూకట్‌పల్లి నియోజకవర్గం వివేకానంద నగర్‌లో జై రామన్ 3డి స్టూడియో ప్రారంభోత్సవం అద్భుతంగా, ఘనంగా జరిగింది. సీతారామయ్య ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన, ఆధునిక సాంకేతికతతో కూడిన 3డి ఫోటోగ్రఫీ సేవలు అందించాలని స్టూడియో నిర్వాహకులను కోరారు. కాలనీవాసులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లాభపడాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవ వేడుకలో స్థానికులు, అభిమానులు, పలు ప్రముఖులు పాల్గొనడంతో కార్యక్రమం మరింత ఉత్సాహంగా సాగింది.

# ఉల్లాస్-నవ భారత సాక్షరతా కార్యక్రమం


బీబీపేట్ మార్చి 29 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, బీబీపేట్ మండలంలోని 28 కేంద్రాల లో యుయల్‌యల్ ఎఏస్ అమ్మకు అక్షర మాల యన్ఐఒఏస్ ఎగ్జామ్ నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలో మండలం లోని అన్ని గ్రామ సంఘాల సభ్యులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పరీక్ష కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలన నిమిత్తం జిల్లా డిఆర్‌డిఓ సురేందర్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు జనగామ గ్రామ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, కోనాపూర్, తుజలపూర్‌ల సర్పంచులు, ఏపియమ్ శ్రీనివాస్, సీసీలు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, బాలచంద్రం రామక్రిష్ణ, అకౌంటెంట్ రాజేందర్ గౌడ్, మండలంలోని అన్ని గ్రామ సంఘాల విఓఏలు, అధ్యక్షులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు హాజరైన బండి రమేష్

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):



మూసాపేట్ రజాక సంఘం ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈదమ్మ, శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు టిపిసిసి ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగ వారు మాట్లాడుతు బోనాల పండుగ తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రజక సంఘం వంటి బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రజకుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు, ఉపాధి అవకాశాలు, సబ్సిడీలు కల్పించింది అని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి వర్గానికి సమాన న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. దోబీ ఘాట్ దగ్గర సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, తూము ఎల్లారావు, రాజు, తూము సంతోష్ కుమార్, సప్పిడి భాస్కర్, అమీర్, బుచ్చిబాబు, రజక సంఘం నాయకులు నోముల యాదగిరి, నోముల స్వామి నరేష్, సత్యనారాయణ, తోట మల్లేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ

ఖమ్మం సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )



సింగరేణి గ్రామానికి చెందిన వృద్ధురాలు హంస వాలి ఠాగూర్ మరణంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. జీవితాంతం సాధారణంగా జీవించిన ఆమెకు చివరి సమయంలో పెద్దగా ఎవరూ లేకపోవడం హృదయ విదారకంగా మారింది. ఈ విషాద సమయంలో గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతేకాకుండా, అంత్యక్రియలలో స్వయంగా పాల్గొని పాడె మోసి తన మానవతా విలువలను ప్రతిబింబించారు.అంత్యక్రియల నిర్వహణ కోసం అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందిస్తూ, ఎవరూ లేని ఆ వృద్ధురాలికి చివరి వరకు అండగా నిలిచారు. ఒక నాయకుడు ప్రజల కష్టసుఖాల్లో ఎలా ఉండాలో సర్పంచ్ టోనీ తన చర్యల ద్వారా చూపించారు. హంస వాలి ఠాగూర్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ ప్రజలు ప్రార్థించారు.

## ప్రేమాక్షరులకు ప్రముఖుల ప్రశంసలు

- తెలుగు వర్సిటీ జర్నలిజం విద్యార్థులు కొత్త పంథాకు నాంది.
- పుస్తక రచన ఆహ్వానదించదగినది.
- మరింత అధ్యయనం, విశ్లేషణలు అవసరమని సూచన.

హైదరాబాద్ ప్రతినిధి అంజిబాబు,మార్చి 29 (జన సంఘర్షణ):



సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులు కొత్త పంథాకు నాంది పలికారని ప్రముఖులు ప్రశంసి స్తున్నారు. ప్రేమాక్షరి పుస్తక రచయి తలను అభినందిస్తున్నారు. విదేశాల్లో జర్నలిజం విద్యార్థులు చదువుతున్న సమయాల్లోనే వీక్లీ పేపర్, రేడియో స్టేషన్లు నడుపుతున్నారని, అలా తెలుగు వర్సిటీ విద్యార్థులు ఒక పుస్తకం తేవడం అభినందనీయమని ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్, సీనియర్ సంపాదకులు డా.కె. శ్రీనివాస్ అన్నారు. ఇదే తరహాలో మిగిలిన విద్యార్థులు కూడా రాయడం నేర్చుకోవాలని సూచించారు. యూనివర్సిటీ బ్లాగ్ లేదా ఫేస్‌బుక్ పేజీ నింపడం, వెబ్‌సైట్ నడపడం వంటివి ఆలోచించాలని సూచించారు. మరింత అధ్యయనం, విశ్లేషణలు అవసరమని సూచించారు. అలాగే ప్రేమాక్షరి ప్రయత్నాన్ని వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, పీఠాధిపతి ఆచార్య బి.హెచ్ పద్మప్రియ, జర్నలిజం అధ్యాపకులు డా.షేక్ హసీనా, డా.షేక్ సమీర్, డా.వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు అభినందించారు. తాను విద్యార్థి దశలోనే ఎన్నో ఆర్టికల్స్, హాస్య కవితలను రాశానని నిత్యానందరావు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ప్రేమాక్షరులు వీరే..**

జర్నలిజం చదువుతూ.. ప్రేమికుల రోజు సందర్భంగా ప్రేమ వ్యక్తీకరణ, ప్రస్తుత పరిణామాలు, యువతీయువకుల మధ్యే కాకుండా, కుటుంబ బంధాలు, బాంధవ్యాలను అక్షరీకరించారు. ఈ నేపథ్యంలో కొందరు విద్యార్థులు. ప్రేమాక్షరి సంపాదకులుగా కొండూరి కోటిబాబు, సహ సంపాదకులుగా ఎస్. కళ్యాణ్ దాస్, నాగుల అంజిబాబు (ఎన్. ఆంజనేయులు) వ్యవహరించారు. ప్రేమాక్షరులుగా కె.ప్రశాంత్, వైద్య వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శ్రీనివాసు, వై.నదియా, సిరిపురం సునేహ, ఎన్.పవన్‌కుమార్, వై.శ్రీధర్, వరుణ్, రమేష్ నాయుడు, జి.శివకుమార్, వై.ప్రవీణ్, ఎన్.లవన్ కుమార్, సత్యోళ్ల ప్రభాకర్, నర్సప్ప కురువ, జి.అశోక్ కుమార్, డా.నవీన్ వజ్ర, చీకూరి లీలావతి, కె.రవికుమార్, ఏమ్మడి సుధీర్ కుమార్ వ్యవహరించారు.

## ప్రతి మహిళకు అక్షరాభ్యాసం అందించాలనే సంకల్పం..

రాజంపేట :మార్చ్ 29 (జనసంఘర్షణ)

ప్రతి మహిళకు అక్షరాభ్యాసం అందించాలనే సంకల్పంతో "ఉల్లాస్" కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు డి.ఆర్.డి.ఓ విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం రాజంపేట మండలంలో రాష్ట్ర స్థాయి మార్గదర్శకత్వంలో సీఈవో దివ్య దేవరాజన్ ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో 12 గ్రామాలలో 17 సెంటర్లు ఏర్పాటు చేసి భారీ స్థాయిలో పరీక్షల నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం సుమారు 800 మంది మహిళా సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పరీక్షలు రాయడం జరిగింది. జనవరి నెల నుండి ప్రతిరోజూ రాత్రి వేళల్లో క్రమంగా చదువుకుంటూ, కనీసం బోర్డులు చదవగలగడం, బస్సుల పేర్లు గుర్తించగలగడం, చిన్న చిన్న లెక్కలు రాయగలగడం వంటి ప్రాథమిక విద్యా నైపుణ్యాలను సాధించేందుకు మహిళలు శ్రమించారని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో విద్యపై ఆసక్తి పెంపొందించడమే కాకుండా, వారి జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలను అక్షరాసులు చేయడం ఒక భగీరథ ప్రయత్నం. మహిళ ఇంట్లో వెలుగైతే, ఆ కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం వెలుగుతుంది" అని తెలిపారు. అనంతరం ఏపిఎం రాజారెడ్డి మాట్లాడుతూ మహిళలు చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని మండలంలో 800 మంది అభ్యాసకులు పరీక్షలు రాయడం గొప్ప విషయం. ఇది వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి మహిళకు అక్షరాభ్యాసం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి అభినందనీయం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాజంపేట గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, సమైక్య కోశాధికారి లక్ష్మమ్మ, సీసీలు దుర్గాదాస్, సాయిబాబా, గంగప్రసాద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**వికలాంగులకు వీల్ చైర్స్ అందజేత**

రాజంపేట మండలంలోని గుండారం గ్రామంలో వికలాంగులకు వీల్ చైర్లను ఏపీడి విజయలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండారం గ్రామ సర్పంచ్ శంకరమ్మ, ఉప సర్పంచ్ శ్యామయ్య, వార్డు సభ్యులు, ఐకెపి ఏపిఎం రాజారెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు సుతారీ లక్ష్మి, సిసి సాయిలు, గ్రామ



సంఘం అధ్యక్షులు యాదమ్మ, సంతోషిని, అనిత యూత్ భీమేష్, నవీన్ పాల్గొన్నారు.

**ఉల్లాస నవభారత సాక్షరత పరీక్ష రాసిన సర్పంచ్‌లు**

జాతీయ సార్వత్రిక విద్యాలయ సంస్థ సహకారంతో ఉల్లాస నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మ అక్షరమాల కార్యక్రమంలో గుండారం సర్పంచ్ కీసరి శంకరమ్మ, గుడి తాండ సర్పంచ్ మేరీ దేవి సింగ్ పరీక్ష రాశారు. చదువు రాని వారు చదివి పరీక్ష రాయడం ఎంతో ఆనందంగా ఉందని మహిళా సంఘంలో చదువుకొని పరీక్ష రాశామని అని సర్పంచ్ లు తెలిపారు.

## కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ బండి రమేష్, మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు మార్చి 29 (జన సంఘర్షణ):



టిపిసిసి ఉపాధ్యక్షులు,కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ బండి రమేష్ సమక్షంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కెపిహెచ్బి డివిజన్లో సుమారు 50 మంది మహిళలు స్వాతి రెడ్డి, లక్ష్మి వారి టీం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి వందలాది మహిళలు కాంగ్రెస్ పార్టీలో ఘనంగా చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి వారిని బండి రమేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, మహిళల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నమ్మకాన్ని నిలబెట్టిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని ధీమా వ్యక్తం చేశారు అర్హులైన ప్రతి మహిళల కుటుంబానికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కేపీహెబీ డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, సీనియర్ నాయకులు మగ్దమ్ బాయ్,బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ అధ్యక్షురాలు రజిత గౌడ్, బండి సుధా, లక్ష్మీ అరవింద, సరోజ, శ్రీధర్ చారి,రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, కొమ్ము బాబు, కళ్యాణ్ బాబు, దుర్గాప్రసాద్, నాగు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ప్రశిక్షణా తరగతుల ముగింపు

- శిక్షణా తరగతులలో నేర్చుకున్న ప్రతి అంశం చాలా విలువైనది, ప్రతి ఒక్కరూ ఆచరించాలి.
- చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- వ్యక్తిత్వ నిర్మాణం ద్వారానే జాతి నిర్మాణం, జాతీయత నిర్మాణం ,దేశ నిర్మాణం
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):

శిక్షణ తరగతులు ప్రతి కార్యకర్తకు మార్గదర్శకం, నాయకులుగా ఎదగాలంటే సరైన శిక్షణ చాలా అవసరం, దేశంలో ఒక్క మన పార్టీలోనే ప్రతి కార్యకర్తకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇస్తారాని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని అనేక విశేషాలను, సాంకేతికతను, నూతన ఆవిష్కరణలను, ప్రజలకు ఉపయోగపడే అనేక విషయాలను వివరించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని చైతన్య కాలేజీలో నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రశిక్షణా తరగతులలో నాయకులు, కార్యకర్తలందరితో కలిసి వీక్షించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్,సాయంత్రం భారతీయ జనతా పార్టీ సంస్థాగత పర్వంలో భాగంగా మాతృ శ్రీ నగర్ వద్ద గల చైతన్య కాలేజీలో నిర్వహించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మాహాభియన్ 2026 ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జి ఆలె భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, ఇంటెలెక్టువల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరావు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ తరగతులు ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని, ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం ఆచరణలో పెట్టాల్సిన అవసరముందని, బీజేపీ పార్టీ సిద్ధాంతాలు, దేశ చరిత్ర, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవలో ఎలా ముందుకు సాగాలో తెలుసుకోవచ్చని, మంచి నాయకుడిగా కావాలంటే సరైన శిక్షణ కూడా అవసరమని, కార్యకర్తలకు , నాయకులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చేది దేశంలో ఒక్క మన బీజేపీ పార్టీనేనని



కొనియాడుతూ, 14 కోట్ల సభ్యత్వాలు, 7,60,000 వేల బూత్ కమిటీలు, 17000 మండల కమిటీలు, 960 పైగా జిల్లా కమిటీలు, 33 రాష్ట్రాల అధ్యక్షుల నియామకం, కమిటీల నిర్మాణం పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ మన బీజేపీ మాత్రమేనని తెలియజేస్తూ, దీనికి కారణం కార్యకర్తలు మాత్రమేనని, కార్యకర్తలు ఆధారంగా ఇక్కడ పని జరుగుతుందని,నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజాభివృద్ధి కోసం కృషి చేసే నిబద్ధత గల కార్యకర్తలు బిజెపి సొంతమని కొనియాడారు. మన పార్టీ స్లోగన్ ఎప్పుడూ ఒక్కటేనని నేషన్ ఫస్ట్ , పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ అని, అధికారంలోకి రావడం ఎంతో మంది సీనియర్ నాయకులు, కార్యకర్తల, ప్రజాభివృద్ధి కోరుకునే ప్రత్యొక్కరి కల అని, దాని కోసం మనమంత కలిసి ఇంకా గట్టిగా పని చేస్తే, తెలంగాణలో బిజెపి రావడం పక్కా అని, అందులో మన శేరిలింగంపల్లి కార్యకర్తల కృషి కూడా ఉండాలన్నారు, ఈరోజు శిక్షణ తరగతులలో మనం క్రమశిక్షణగా నేర్చుకున్న ప్రతి అంశం మనకు మార్గదర్శకం అని, మన వ్యక్తిత్వ నిర్మాణం ద్వారానే జాతి నిర్మాణం, జాతీయత నిర్మాణం ,దేశ నిర్మాణం జరుగుతుందని, ఈ దేశం కోసం, ధర్మం కోసం సమాజ హితం కోసం మనమందరం కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నరేష్ యాదవ్, అనిల్ గౌడ్ ఉపాధ్యక్షుడు, రాధాకృష్ణ యాదవ్, స్రవంతి, దుర్గాప్రసాద్, మాణిక్ రావు కృష్ణంరాజు, బుచ్చిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, వసంత్ యాదవ్, పద్మ, ఎల్లేష్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ బస్తీ బాట

- నిజాంపేట్ సర్కిల్‌లో ఇళ్ల పరిశీలన
- పర్యటించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్.

హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి అంజిబాబు,మార్చి 29 (జన సంఘర్షణ):

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించి అక్కడి నివాసితుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా పార్క్ నిర్మాణం చేయాలని,ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని, ఆర్టీసీ బస్సు కాలనీ లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని 9వ అంతస్తులో నీళ్ల లోపలికి రావడం సమస్యను పరిష్కరించాలని, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గంజాయి సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య అన్ని ప్రాంతాల్లో ఉందని తెలిపారు. ఈ కాలనీలో సుమారు 1100 కుటుంబాలు, 5000 మంది జనాభా ఉన్నారని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరమైతే, సుమారు 6.5 లక్షల లీటర్ల నీరు అవసరం ఉందని చెప్పారు. అన్ని డబుల్ బెడ్ రూమ్ భవనాలకు వాటర్ ప్రూఫింగ్ చేయాలని సూచించారు. అలాగే జనాభా ప్రాతిపదికన ఆశ వర్కర్స్, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అనుగుణంగా ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒక గ్రామంలో ఉండే విధంగా అన్ని అవసరమైన షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. దోమల సమస్య నివారణకు సమీప చెరువును పూర్తిగా శుభ్రం చేయాలని,శ్మశాన వాటిక, దేవాలయాల నిర్మాణం చేయాలని కోరారు.



చివరగా,కాలనీ ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని సూచిస్తూ, తాగునీటి సమస్య పరిష్కారం కోసం వెంటనే బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అడిషనల్ డీసీ రమేష్, ఎ ఈ ప్రవీణ్,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ సెల్ కో–కన్వీనర్ రావుల శేషగిరి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, యస్ సి మోర్చా రాష్ట్ర నాయకులు దాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి ప్రొఫెసర్ చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్, మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, జిల్లా బిల్డర్స్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు, ప్రగతి నగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, బీజేవైఎం నాయకులు సాయి కృష్ణా రెడ్డి, స్థానిక నాయకులు గజ్జెల్లి సంతోష్, సచిన్, ఉదయ్, భూపాల్, అశోక్, నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు ఏవైనా పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

- టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):

ప్రజా సమస్యలు ఏవైనా పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్ శివయ్య బస్తీలో సమస్యల పరిష్కారం కోసం స్థానిక నాయకులు ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన బస్తీలో విస్తృతంగా పర్యటించారు. లక్ష్మణ్ గౌడ్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా బోరబండ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగలు రాత్రి తేడా లేకుండా కొంతమంది రౌడీ మూకలు సంఘవిద్రోహ శక్తులు గంజాయి, మద్యం సేవిస్తూ స్థానికంగా శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తున్నారని ఈ కారణంగా మహిళలు పిల్లలు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇక్కడ చెత్త తరలింపు పెద్ద సమస్యగా తయారైందని రోజుల తరబడి పోగైనచెత్త భారీగా పేరుకుపోవడంతో స్థానికంగా దుర్గంధం వ్యాపించి ప్రజలు నివసించలేని పరిస్థితి ఏర్పడిందని రమేష్ కి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సంబంధిత పోలీసు రైల్వే జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్లో మాట్లాడి



వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులకు సహకరించాలని సూచించారు. దీనిపై ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గంధం రాజు, కొప్పిశెట్టి దినేష్, బర్కత్ ఆలీ, నరసింహ, మన్సూర్, సఫీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# "కార్మికులకు న్యాయం––సమానత్వం సాధించడం" కోసం టిపిసిసి లేబర్ సెల్, ఐఎన్టీయూసీ కృషి చేస్తోంది

- శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు,మార్చి 29 (జన సంఘర్షణ):




శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రామ్ నరేష్ నగర్‌లో ఆదివారం రోజు నూతనంగా ఏర్పాటు చేసిన టీపీసీసీ లేబర్ సెల్, ఐఎన్టీయుసి కార్యాలయన్ని రాష్ట్ర ఇంఛార్జి సంగిశెట్టి జగదీశ్వర్ రావు, రాష్ట్ర చైర్మన్ ప్రకాష్ గౌడ్, టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, రాష్ట్ర లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి సుజిత్ గాంధీ, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రంగారెడ్డి జిల్లా లేబర్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, రంగారెడ్డి జిల్లా అధ్య క్షులు ప్రవీణ్ ఎ–బ్లాక్ అధ్యక్షురాలు రాష్ట్ర లేబర్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీదేవి, శేరిలింగంపల్లి నియోజకవర్గం టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షులు మోహన్ రెడ్డితో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన ఐఎన్టీయూసీ, లేబర్ సెల్ వల్లే ఈ రోజు మనం గర్వంగా చెప్పుకోవాల్సిన విషయం,ఈ దేశ నిర్మాణంలో అసలు శక్తి ఎవరిదంటే అది కార్మికులది, కర్మాగారాల్లో చెమటోడ్చే కార్మికుడు, రోడ్లపై కష్టపడే కూలీ, రైతు పొలంలో శ్రమించే కార్మికుడు వీరే భారత దేశానికి అసలు బలం.అనే మహత్తర సంస్థ ఈ కార్మికుల హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతోందని, ఇది కేవలం ఒక యూనియన్ కాదు..ఇది కార్మికుల గళం, వారి ఆశలు, వారి భవి ష్యత్తు అని తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం సామాజిక భద్రత కోసం టిపిసిసి లేబర్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి హక్కులను కాపాడడం సమాజంలో గౌరవప్రద స్థానం కల్పించడం లక్ష్యంగా పనిచేస్తుందని, ఈ విభాగం ప్రధానంగా కార్మికుల సమస్యలను పరిష్కరించడా నికి,వారి అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లేబర్ సెల్ నాయకులు వీరేందర్ గౌడ్,ముద్దంగుల తిరుపతి, దినేష్ రాజ్,హైదర్ నగర్ డివిజన్ లేబర్ సేల్ అధ్యక్షులు షేక్ ఫయాజ్ ,రామ్ నరేష్ నగర్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి,ఫయాజ్, మన్నేపల్లి సాంబశివరావు, కట్ల శేఖర్‌రెడ్డి, నర్సింగ్, శివ, మాణిక్యం, శివాజీ, ప్రభు, వెంకటేష్, కృష్ణ, రవీందర్ రావు, ఆల్విన్ కాలనీ లేబర్ సెల్ అధ్యక్షులు రవి కుమార్, కమల ప్రసన్ననగర్ అధ్యక్షులు రాఘవరెడ్డి, వెంకటేష్, ఫసియుద్దీన్, మహేష్, దయాకర్రెడ్డి, శివాజీ, సాజిద్, మహిళా నాయకులు సంగీత, శ్రీదేవి, జయ, అనిత, కృష్ణ వేణి, టిపిసిసి, లేబర్ సెల్ ఐఎన్టియుసి శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యాలయాన్ని ఏర్పాటులో తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ శాసన సభాపక్షం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని మాజీ మంత్రి కెటిఆర్, హరీష్ రావు డిమాండ్.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ శాసన సభాపక్షం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం రోజు ఉదయం అమరవీరుల స్థూపం వద్ద నుంచి అసెంబ్లీ వరకు నిర్వహించిన నిరసన ప్రదర్శన లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు హాజరైనారు. ప్రధానంగా ఎలాంటి అనుమతులు లేకుండా 111 జీఓ పరిధిలోని భూముల్లో మైనింగ్ నిర్వహిస్తున్న మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవులను అడ్డు పెట్టుకుని తెలంగాణకు దోచుకుంటున్నారని, అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, హౌస్ కమిటీ ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్ కు అడ్డుకట్ట వేయాలని మాజీ మంత్రి కెటిఆర్, హరీష్ రావులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డి, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వివేకానంద, పద్మారావు గౌడ్ ప్రశాంత్ రెడ్డి, కాలేరు వెంకటేష్, లక్ష్మారెడ్డి తదితర ఎమ్మెలేలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా మూసాపేట్ దోబీ ఘాట్ ఈదమ్మ ఆలయంలో బోనాల పండుగ

- ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు.

హైదరాబాద్ కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు మార్చి 29 (జన సంఘర్షణ):



మూసాపేట్ డివిజన్ పరిధిలోని ఈదమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో మూసాపేట్ దోబీ ఘాట్‌లోని ఈదమ్మ ఆలయంలో బోనాల పండుగను భక్తి, ఉత్సాహం, ఆధ్యాత్మిక మహిమల నడుమ అత్యంత వైభవంగా జరిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రజక సంఘం ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొని ఈదమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దివ్య కటాక్షం పొందారు. భక్తులతో కలిసి పాల్గొన్న ఆయన దర్శనం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "దోబీ ఘాట్ అభివృద్ధి, ఈదమ్మ ఆలయ అభివృద్ధి మా బాధ్యత. ఇందుకు అవసరమైన సహకారం అందించేందుకు నేను ఎల్లప్పుడూ ముందుంటాను" అని వడ్డేపల్లి రాజేశ్వరరావు హామీ ఇచ్చారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ బీసీ వర్గాల కోసం తీసుకొచ్చిన అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ జీవితాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.

# బంజారా సమాజం ఐక్యమతంతో ముందుకు సాగాలి

ఎల్లారెడ్డి, మార్చి –29(జన సంఘర్షణ )



బంజారా సమాజం ఐక్యమతంతో ముందుకు సాగాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షులు సురేందర్ నాయక్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని 1వ వార్డులో ఉన్న జగదంబ సేవాలాల్ మహారాజ్ మందిరంలో బంజారా సేవా సమితి, ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ శ్రీ పద్మ శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు సురేందర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజారా సేవా సమితి సభ్యులు చైర్మన్ పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మంచిర్యాల విద్యాసాగర్, బంజారా నాయకులు, కౌన్సిలర్లకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ.. జగదాంబ మాత సేవలో 75 సంవత్సరాల పాటు అన్నపానీయాలు ముట్టకుండా బంజారా సోదరుల అస్తిత్వ పరిరక్షణ కోసం రామ్ రావు మహారాజ్ గారు చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు. బంజారా సమాజం ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, భవిష్యత్తులో మందిర నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా శక్తిపీఠం కోశాధికారి బధ్యానాయక్, కామారెడ్డి జిల్లా ఏఐబిఎస్ఎస్ అధ్యక్షులు సురేందర్, ఎల్లారెడ్డి మండల బంజారా సేవ సంఘం అధ్యక్షులు రాములు నాయక్ , ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, తాడ్వాయి, గాంధారి మండలాల అధ్యక్షులు బంజారా సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మార్చి 29 (జన సంఘర్షణ):





కూకట్పల్లి నియోజకవర్గంలో మహిళలకు సాధికారత దిశగా ప్రోత్సాహం అందించేందుకు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో కుట్టు మిషన్లు అందజేశారు. ఆదివారం రోజు ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొంది సర్టిఫికెట్లను అందుకున్న మహిళలకు తన సొంత డబ్బులతో కుట్టు మిషన్లను అందజేశారు. గత నాలుగేళ్లుగా మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లను అందిస్తున్నామని, మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఏమ్మెల్యే మాధవరంకృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు మహిళలకు అనేక హామీలను ఇచ్చారని ఉచిత బస్సు మినహా కనీసం ఒక్క హామీకూడా నెరవేర్చలేదని విమర్శించారు. పేదలకు ఉచితంగా అందించే సేవల పట్ల నిర్బంధాలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు పాల్గొన్న, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్న వారిపై ఒత్తిళ్లు ఉన్నాయని ఇలా అయితే రాష్ట్రం అభివృద్ధి చెందటం కాదు అధోగతి పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఒత్తిళ్లు చేసినా, ఎంత నిలువరించాలని ప్రయత్నించినా తాను ప్రజలకు ఉచితంగా తనదైన శైలిలో చేపట్టే కార్యక్రమాలు మాత్రం ఆపేది లేదని కొనసాగిస్తూనే ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమలో కార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాది, మంజులత మల్లాది తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
సోమవారం
30 మార్చి 2026

# గోదావరి పుష్కరాల నిర్వహణపై కార్యచరణ ప్రణాళికపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించిన సీఎం

తెలంగాణ /మార్చ్ 29/ (జన సంఘర్షణ)

2027 జూన్‌లో జరగబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. పుష్కరాల కోసం బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆలయాలు, పుష్కరఘాట్ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులతో శాసనసభ సమావేశ హాలులో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. 2027 జూన్ గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. అందుకోసం రూపొందించిన ప్రణాళికలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇంజనీర్లతో టెక్నికల్ కమిటీని నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే 15 లేదా 20 రోజుల్లో నివేదికను సమర్పించాలని చెప్పారు. ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను రూపొందించి మంత్రివర్గ ఉప సంఘానికి పంపించాలని, ఉప సంఘం ఆమోదించిన తర్వాత గోదావరి పుష్కరాల సమగ్ర ప్రణాళికపై మంత్రిమండలి తుదినిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పుష్కరాల కోసం శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల నిర్మాణం, విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే భక్తులు, పర్యాటకులకు ఇబ్బందులు రాకుండా ప్రాంతాల మధ్య కనెక్టివిటీ సరిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి,



ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఈ సందర్భంగా అధికారులు వివరించగా, ముఖ్యమంత్రి ఓ పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# దళారులపై ఉక్కుపాదం.. ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరిక!

● **దళారులపై ఉక్కుపాదం.. ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరిక!**

బోధన్/మార్చ్ 29/(జన సంఘర్షణ)

బోధన్ డివిజన్ పరిధిలో వరి కోతల ప్రారంభమైనప్పటికీ పండించిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. పండించిన ఉత్పత్తులను సకాలంలో విక్రయిద్దాం అంటే కష్టాలు తప్పడం లేదు. ధాన్యం దళారులు తక్కువ ధరకు వరిని కొనుగోలు చేసి రైతులను నిలువుగా ముంచుతున్నారు. క్వింటాకు రూ. 1950 దళారు చెల్లించి తేమ పేరుతో మూడు కిలోల తరుగును అదనంగా దోచుకుంటూ రైతులను ముంచుతున్నారు. సకాలంలో దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దలార్ల పాలు చేయక తప్పడం లేదు. మిక్రయాలు చివరిదశకు చేరుకోగానే ఆదరాబాదరగా కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నారు. మరోవైపు వ్యాపారస్తులు సిండికేట్ గా మారి హమాలీ క్యాష్ కటింగ్ పేరుతో రైతులను దోచుకుంటున్నారు బోధన్ డివిజన్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు తెరిచినట్లయితే రైతులకు మేలు జరుగుతుంది. అలా జరగకపోవడంతో నల్గొండ, మిర్యాలగూడ, మహారాష్ట్ర వ్యాపారులు వచ్చి ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. గతేడ అది బోధన్ డివిజన్ పరిధిలో కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యాపారి వచ్చి సుమారు 250 మంది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 5 కోట్లకు ఎగనాం వేసి వెళ్ళిపోయాడు. ఇంతవరకు వ్యాపారి రైతుకు ఒక రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవు. రైతులు బోధన్ వర్ని పోలీస్ స్టేషన్లో వ్యాపారిపై కేసులు పెట్టినప్పటికీ ఎలాంటి



ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం ముందుగా కొనుగోలు కేంద్రాలు తెరిచినట్లయితే ఇలాంటి పునారవృతం కాకుండా ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిన్న ముంచుతున్న దళారులు లైసెన్సులు లేని దళారుల చలామణి జీఎస్టి టాక్స్ ఎగవేత:** నిబంధనల ప్రకారం దళారులు వ్యవసాయ మార్కెట్ కమిటీలు కచ్చితంగా లైసెన్సులు తీసుకోవాలి. 5000 పైబడి చెల్లింపులు చేసినట్లయితే సదరు దళారి జీఎస్టీ చెల్లించి ప్రభుత్వానికి టాక్స్ కట్టాల్సి ఉంటుంది. బోధన్ డివిజన్ రుద్రూర్ మండల కేంద్రంలో ఓదలారి ఏకంగా రైతులను మోసం చేస్తూ రైతులు డబ్బులు సైతం సంతానికి వాడుకుంటూ అనేకమార్లు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించలేదు. వాస్తవానికి సదరు దళారి నిరక్షరాశులు అయినప్పటికీ రైతులను మభ్యపెడుతూ క్యాష్ కటింగ్ పేరుతో భారీ స్థాయిలో డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తన వెనకాల ఒక ప్రజాప్రతిని ఉన్నాడంటూ రైతులను మోసగించడంతోపాటు మార్కెట్ కామ పోలీస్ శాఖ అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నాడు. దళారులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసినట్లయితే ప్రభుత్వ ఆదాయానికి మేలు చేకూరుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఏకకాలంలో చెల్లించాల్సిన డబ్బులు రుద్రూర్ చెందిన దళారి తన స్వప్రయోజనాలకు రైతుల డబ్బులను వినియోగించుకుంటూ ఏడాది కాలం పాటు డబ్బులు చెల్లించడంలో వేధింపులకు గురి చేసినట్లు చేసినట్లు అనేక మంది బాధ్యత రైతులు గతంలో ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ అధికారులు ఇలాంటి దళారులపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకున్నట్లయితే రైతుల మోసపోయే అవకాశం ఉండదు. నిబంధన ప్రకారం లైసెన్స్ పొందిన దళారి వద్ద డబ్బులు రైతులకు సులువుగా వస్తాయి. ఇలాంటి దళారుల వద్ద నుండి డబ్బులు తీసుకోవడం గగనమే అనిపిస్తుంది. లైసెన్స్ లేని దళారులపై చర్యలు తీసుకుంటాం, బోధన్ ఎసిపి శ్రీనివాస్. రైతులు దళారుల ఆశ్రయించి మోసపోవద్దని లైసెన్స్ లు ఉన్న దళారులకు మాత్రం ధాన్యం విక్రాయించాలి. లైసెన్స్ లేని దళారులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. బోధన్ డివిజన్ పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# గాంధారిలో దారుణం... బంగారం కోసం అత్తను హతమార్చిన కోడలు

గాంధారి/మార్చ్ 29/(జన సంఘర్షణ)



గాంధారిలో మండలంలో దారుణం చోటు చేసుకుంది. బంగారం కోసం ఓ కోడలు తన అత్తను బండరాయితో కొట్టి హత్య చేసింది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది.

బంగారంపై మోజుతో.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని సీతాయపల్లి గ్రామంలో, కావటి రుక్మవ్వ (73)కు నలుగురు సంతానం. అయితే అందులో ఇద్దరు పెద్ద కొడుకులు చనిపోవడంతో వారి భార్యలు, రుక్మవ్వ వేర్వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే చిన్న కొడుకు మాత్రం హైదరాబాద్‌లో బతుకుదెరువు కోసం వెళ్లాడు. రెండో కొడుకు భూమయ్య భార్య, అయిన కోటవ్వ తరచూ అత్త రుక్మవ్వతో డబ్బుల విషయంలో గొడవ పడుతూ ఉండేది. శనివారం తెల్లవారుజామున ఎలాగైనా ఆమెను హత్యచేసి ఆమె దగ్గర ఉన్న డబ్బు, బంగారం తీసుకోవచ్చని ఆలోచన చేసింది.

**బండరాయితో కొట్టి..**

రుక్మవ్వ తలపై కోటవ్వ బండరాయితో కొట్టగా ఆమె అక్కడికక్కటే మృతి చెందింది. అటుపై ఆమె మెడలో, ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు చోరీ చేసి.. ఎవరికి తెలియకుండానే అందరితో పాటు , ఏడుస్తూ కూర్చుంది. అయితే బంధువులకు అనుమానం రాగా.. రుక్మవ్వ కూతురు కిష్టవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి కోడలిని నిందితురాలిగా గుర్తించారు. నేరస్థలాన్ని సదాశివ నగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

# ఇల్లందు ప్రెస్ క్లబ్‌కు నూతన కమిటీ ఎన్నిక

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )



ఇల్లందు: స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మాటేటి మధు (నినాదం) ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా తాడూరి శేఖర్ (99టీవీ) బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా ఆవుల భాస్కర్ (దిశ), రవి (999)లను ఎన్నుకోగా, సహాయ కార్యదర్శులుగా రఫీ, రాజేష్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా సురేంద్రబాబు, కోశాధికారిగా గౌరిశెట్టి విజ్ఞాన్ (విశాలాంధ్ర)లను సభ్యులు ఎంపిక చేశారు. ఈ ఎన్నికలను సీనియర్ జర్నలిస్టులు కొత్త వెంకటేశ్వర్లు, అన్నవరపు వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులుగా పర్యవేక్షించి విజయవంతంగా నిర్వహించారు. నూతన కమిటీకి పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జగిత్యాల జిల్లా ప్రేమ జంట అదృశ్యం...

● **ఎస్సారెస్పీ కెనాల్ లో ఇద్దరి మృతదేహాలు లభ్యం**

జగిత్యాల్ /మార్చ్29/(జన సంఘర్షణ)






మెట్ పల్లి మండలం పెద్దాపూర్ శివారులో 2 రోజుల క్రితం ప్రేమ జంట అదృశ్యం కాగా ఇద్దరి మృతదేహాలు ఎస్సారెస్పీ కెనాల్ లో లభించడం కలకలం సృష్టిస్తుంది. మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన యువతి, మహారాష్ట్రకు చెందిన వలస కూలీ అంకుశ్ ప్రేమించుకున్నారు. యువతికి బైక్ నేర్పే క్రమంలో బైక్‌తో సహా ఇద్దరు కెనాల్‌లో పడినట్లు భావిస్తున్నారు.

# తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు పోతుంది

● **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**

తెలంగాణ/మార్చ్ 29/(జన సంఘర్షణ)



తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో కూడా గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. శాసనసభ సమావేశ హాలులో ముఖ్యమంత్రితో ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియ వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకా గాంధీ బృందానికి తెలియజేశారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా మేనకా గాంధీ కొనియాడారు.

# అక్రమ మైనింగ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన

● **అసెంబ్లీ నుండి సస్పెన్షన్**

తెలంగాణ/మార్చ్ 29/(జన సంఘర్షణ)



రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపడుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల పాటు అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసింది. ఈ సంఘటనతో శాసనసభలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపడుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల పాటు అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసింది. ఈ సంఘటనతో శాసనసభలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అక్రమ మైనింగ్ కు పాల్పడుతోందని ఆరోపిస్తూ అసెంబ్లీలో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారుఅయితే, ఎమ్మెల్యేల ఆందోళన శాసనసభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించిందని, సభాపతి ఆదేశాలను పాటించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో, వారిని రెండు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తమ గొంతును అణచివేసేందుకే ఈ చర్య తీసుకున్నారని ఆరోపించాయి. ప్రజా సమస్యలను లేవనెత్తే హక్కు తమకు ఉందని, దానిని అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది. అక్రమ మైనింగ్ వంటి కీలక అంశాలపై ప్రతిపక్షాల గళాన్ని అణచివేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ వివాదం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది.

# ఈద్ మిలాప్ ఆత్మీయ సమ్మేళనం




నిజాంబాద్ సిటీ . మార్చి 29 . (జన సంఘర్షణ )
జమాతే ఇస్లాం హిందూ నిజాంబాద్ సిటీ వారి తరఫున నిర్వహించిన కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఖలీల్ వాడిలోని న్యూ అంబేద్కర్ భవన్లో అట్టాసంగా జరిగింది.. ఈ కార్యక్రమంలో అన్ని మతాలకు సంబంధించిన మత పెద్దలు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోలీస్ అధికారి ఏసిపి ప్రకాష్ మాట్లాడుతూ సర్వమత సమ్మేళనం సర్వమత సోదరా భావం అందరిలో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే నిజామాబాద్ జిల్లాలో అందరూ సోదర భావంతో మెలగాలని ప్రేమ ఆప్యాయత అనురాగం ఐక్యత సమానత్వంతో కలిసిమెలిసి ఉండాలని, సమాజంలో తమ స్వార్థం కోసం చేసే కొంతమంది పుకార్ల వల్ల శాంతి భద్రత సమస్యలు ఏర్పడుతుంటాయని అలాంటి విషయాల పట్ల పోలీస్ శాఖ కఠినంగా పనిచేస్తుందని అన్ని పండుగలు ఒకరికొకరు గౌరవించుకోనీ జరుపుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. హిందూ మత పెద్దలు గణపతి అశోక శర్మ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే హిందూ మత పండుగలు తెలియజేస్తాయని సమాజంలో దేవుని దృష్టిలో అందరూ సమానమే అని ఆయన తెలిపారు.. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు జెకర్యాఆనంద్ మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వాడిని ప్రేమించమని బైబిల్ చెప్తుందని, శాంతి, సమాధానం సకల సమస్యలకుశాంతి, సమాధానం సకల సమస్యలకు పరిష్కారమని క్రైస్తవ మత పెద్దలు జకర్య ఆనంద్ తెలియజేశారు. సిక్కు మత పెద్దలు దర్శన్ సోకి మాట్లాడుతూ తోటి ప్రజలకు ఇతరులకు సేవ చేయడము భగవంతునికి సేవ చేసినంత సమానమని ఆయన తెలిపారు.. ఈ యొక్క కార్యక్రమంలో అన్ని మతాల సభ్యులు , ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు గణపతి అశోక శర్మ, జకర్యా ఆనంద్, దర్శన్ సింగ్ సోకి , జిల్లాలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన మత సభ్యులు పాస్టర్లు , దర్శన్ సింగ్ సోకి.నిజామాబాద్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జకర్య ఆనంద్ , గాజులపేట గురుద్వారా ప్రెసిడెంట్ దర్శన్ సింగ్ సోకి గణపతి విద్య పీఠం ప్రెసిడెంట్ గణపతి అశోక శర్మ మొదలగు వారు పాల్గొన్నారు..

# ఇల్లందు ప్రెస్ క్లబ్‌కు నూతన కమిటీ ఎన్నిక

**భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )**



ఇల్లందు: స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మాటేటి మధు (నినాదం) ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా తాదూరి శేఖర్ (99టీవీ) బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా ఆవుల భాస్కర్ (దిశ), రవి (999)లను ఎన్నుకోగా, సహాయ కార్యదర్శులుగా రఫీ, రాజేష్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా సురేంద్రబాబు, కోశాధికారిగా గౌరిశెట్టి విజ్ఞాన్ (విశాలాంధ్ర)లను సభ్యులు ఎంపిక చేశారు. ఈ ఎన్నికలను సీనియర్ జర్నలిస్టులు కొత్త వెంకటేశ్వర్లు, అన్నవరపు వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులుగా పర్యవేక్షించి విజయవంతంగా నిర్వహించారు. నూతన కమిటీకి పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాన్సువాడ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జిగా స్థిరత్వమేనా .. ?

# బిజెపిలో నాడు మాల్యాద్రి రెడ్డి నేడు బాన్సువాడ ఇంచార్జ్ శశాంక్ ఎన్నారై..



**బాన్సువాడ /మార్చ్29/(జన సంఘర్షణ)**
ఎన్నారై శశాంక్ అన్న పర్మినెంట్ గా ఉంటారా లేక వారు కూడా బాన్సువాడ నియోజకవర్గం లో బిజెపి పార్టీలో ఇన్చార్జి ఎవరు గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఎండల లక్ష్మీనారాయణ అంటున్నారు కానీ కొంతమంది మాత్రం ఎన్నారై శశాంక్ కన్నా అంటున్నారు ఎవరు ఏది వాస్తవం కొద్ది రాజులు మాత్రమే శశింకన్నా ఉంటున్నారు కార్యక్రమాలు చేస్తున్నారు ఆర్థిక సహకారాలు చేస్తున్నారు గతంలో కొంతమంది ఇదే ధోరణిలో ఇలాగే చేశారు. కానీ అలాంటివారు బిజెపి పార్టీలో లేరు భవిష్యత్తులో బాన్సువాడ నియోజకవర్గం లో బిజెపి పార్టీలో ఎవరు ఉంటారు, ప్రస్తుతం ఎన్నారై కోనేరు శశాంక్ మూలంగా బిజెపి పార్టీ ప్రజల్లో దూసుకుపోతుంది, భరోసా ఏర్పడుతుందని చర్చ ఇది కంటిన్యూగా కొనసాగుతుందా లేక డిస్కంటిన్యూ అయ్యే అవకాశాలు ఉన్నాయా ఏది నిజం గతంలో ఉండి హల్చల్ చేసినారు వెళ్లిపోయిన దాఖలు మళ్లీ పునృతం అవుతాయా లేక కోనేరు శశాంక్ అన్న ఎన్నారై పర్మినెంట్ గా ఉంటారా గతంలో ఉన్నవారికి కొంతమంది రాంగ్ గైడెన్స్ ఇవ్వడం వల్ల గతంలో వారు వెళ్లిపోయారు అనేది చర్చ అయితే ప్రస్తుతం ఉన్న వారికి రాంగ్ గైడెన్స్ ఇచ్చేవారు ఉన్నారా లేక మంచి గైడెన్స్ ఇచ్చేవారు ఉన్నారా నిల దక్కుకునే పరిస్థితులు ఉన్నాయా మంచి సేవలు ఏ విధంగా అయితే ప్రస్తుతం కొనసాగుతున్నాయో మళ్లీ శాశ్వతంగా నియోజకవర్గంలో కొనసాగే అవకాశాలు ఉన్నాయా ఏది నిజం




FORM IV_

Statement about ownership and other particulars about newspaper **JANA SANGARSHANA TELUGU DAILY** to be published in the first issueevery year after the last day of march 2026

| | |
|---|---|
| 1. Place of publication | : NIZAMABAD |
| 2 .Periodicty of its publication | : Daily |
| 3 . RNI No | : **TEL TEL 2024/ 89323** |
| 4 . Printer name | : BATTARU SETTY MURALINationality : IndianAddress : 42- 603/1/1-A , MJ Colony. Street number 5, MJ Colony MoulaAli , Secunderabad , Telangana 500040, |
| 5 . Publisher name | : **RACHA MALLU MADHAVI** |
| 6.Editor name | : **RACHA MALLU MADHAVI** |
| Nationality | : Indian |
| Address | : H. No. 10-10-117 / 150. Nai Brahman Colony , Neeru Gunda Hanuman road , Nagaram, Nizamabad ,twon,& distric, Nizamabad - (Telangana state)503001 |
| 7. Names and address and individuals who won the newspaper or share holders holding more than one percent of the total capital. | : **RACHA MALLU MADHAVI** |

I **RACHA MALLU MADHAVI** , hereby daclare than the parciturlars given above are true to the best of my knowledge and belief .

Date : 29. 3 . 2026

Sd/-
Signature of publishers

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co